# ఇంటింటికీ దరఖాస్తు ఫారాలు పంపిణీ

- కొన్నిచోట్ల ఫారాలు అందలేదని దరఖాస్తుదారుల ఆగ్రహం, అసహనం
- ప్రజాపాలన స్వీకరణ కేంద్రానికి తెల్లవారుజాము నుంచే లైన్‌లో ప్రజలు
- పలుచోట్ల సరైన ఏర్పాట్లు లేకపోవడంతో తోపులాటలు, వాగ్వాదాలు



బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్ వద్ద దరఖాస్తు ఫారాలు ఇచ్చేందుకు క్యూ కట్టిన ప్రజలు

సికింద్రాబాద్, డిసెంబర్29:'ప్రజాపాలన' కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం అధికారులు దరఖాస్తుల స్వీకరించారు. సిబ్బందితో దరఖాస్తుల ఫారాలను ఇంటింటికీ పంపిణీ చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఐదు గ్యారెంటీలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు ప్రజలు భారీగా క్యూ కట్టారు. రెండో రోజు కూడా అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో పలుచోట్ల తోపులాటలు, వాగ్వాదాలు జరిగాయి. దరఖాస్తుల ఫారాలు ఇచ్చేందుకు జనవరి 6 తేదీ వరకు సమయం ఉన్నా ప్రజలు దరఖాస్తుల ఫారాల స్వీకరణ కేంద్రానికి తెల్లవారుజాము నుంచే లైన్‌ల్లో కదుతున్నారు. వార్డుల వారీగా దరఖాస్తులు పంపిణీ చేయగా అందులో కొంత మందికి దరఖాస్తులు అందలేదు. అందని మరి కొందరు దరఖాస్తుల ఫారాల కోసం అధికారులను ప్రజలు నిలదీస్తున్నారు. బ్లాక్‌లో జిరాక్స్ కేంద్రాల నుంచి డబ్బులు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు ఉదయం 8 గంటలకే నియోజకవర్గంలో కేంద్రాలను తీశారు. పలు చోట్ల అధికారులు దరఖాస్తు స్వీకరణకు సరైనా ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి ఆదేశాలతో చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు సిరికొండ మట్టంరాజు, శంకర్‌తోపాటు ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది దరఖాస్తు స్వీకరణ కేంద్రాల వద్ద బందోబస్తు చేపట్టారు. గొడవలు జరిగిన ప్రాంతాల్లో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

### దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలు..

సీతాఫల్‌మండి, తార్నాక, మెట్టుగూడ, అడ్డగుట్ట, బౌద్ధనగర్ తదితర డివిజన్లలో అధికారులు దరఖాస్తు స్వీకరణ కేందాలను ఏర్పాటు చేశారు. డివిజన్ పరిధిలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో ఉప్పరిబస్తీ కమ్యూనిటీ హాల్‌లో, నామాలగుండులోని వార్డు కార్యాలయంలో, ఇందిరానగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో, బీదలబస్తీ గ్రౌండ్‌లో కేంద్రలను ఏర్పాటు చేశారు. అడ్డగుట్ట డివిజన్ పరిధిలో బాబు జగ్జీవన్ రాం భవన్, తుకారాంగేట్ బోయ బస్తీ, తుకారాంగేట్ ఎంసీహెచ్ క్వార్టర్స్, గాంధీనగర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, మెట్టుగూడ డివిజన్ పరిధిలో మధురాజ్ సంఘం భవనం, తార్నాక డివిజన్ పరిధిలో మాణికేశ్వరీనగర్ ఏడు గుళ్ళు, నాగార్జుననగర్ కమ్యూనిటీ హాల్, లాలాపేట జయశంకర్ స్టేడియం, బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని కమ్యూనిటీ హాల్, అశోక్ నగర్ సేవా సంఘం, అశోక్‌నగర్ కమ్యూనిటీ హాల్, బాల్వాడీ స్కూల్‌లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ పలుచోట్ల అధికారులు సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేశారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ప్రతినిధులు

## 'కస్తూర్బా' స్కూళ్లపై ప్రజావాణిలో ఫిర్యాదు

అడ్డగుట్ట, డిసెంబర్ 29: 'తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక' ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు బెడ్‌షీట్స్, కార్పెట్స్, ట్రంక్ బాక్స్, ప్లేట్స్, గ్లాసులు ఇవ్వడం లేదని, పాత వాటిని వాడకం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'ఐజానిక్ కిట్' కూడా అందడం లేదని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తల్లుల సంఘం ప్రతినిధులు సాయిలక్ష్మి, లావణ్య, అనిత, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, బాలయ్య పాల్గొన్నారు.



## కన్నులపండువగా అయ్యప్ప పడిపూజ

తార్నాక డివిజన్ లాలాపేటలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే పద్మారావు తనయులు రామేశ్వర్‌గౌడ్, కిశోర్‌గౌడ్, త్రినేత్ర పూజకు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. - ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 29



## మహిళా ఉద్యోగినులకు లంచ్ రూమ్

ఉస్మానియా యూనివర్సిటీ పరిపాలనా భవనంలో మహిళా ఉద్యోగులకు అధికారులు శుక్రవారం లంచ్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. - ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 29

## సనాతన ధర్మం పేరుతో బీజేపీ ఆగడాలు

- ప్రజాస్వామిక వాదులందరూ ఏకం కావాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపు

ఖైరతాబాద్, డిసెంబర్ 29: సనాతన ధర్మం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆగడాలు మితిమీరుతున్నాయని వక్తలు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేవీసీ ఆఫ్ సెక్యూలర్ డెమోక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ సమాచార హక్కు కమిషనర్ మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్ రావు, సాగరాబేగం, తెలంగాణ వికల్ కేంద్రం వైఖరిని ఖండించారు. దేశంలో మతోన్మాద దోరణికి మణిపూర్ ఘటనే ఉదాహరణగా నిలుస్తుందన్నారు. సనాతన ధర్మ, హిందుత్వం పేరుతో బీజేపీ ప్రభుత్వం విద్వేషాలు సృష్టిస్తుందన్నారు. కేంద్రం వైఖరితో భారతదేశం వంద సంవత్సరాలు వెనక్కి నెట్టివేయబడిందన్నారు. పార్లమెంట్‌లో మెజార్టీ సభ్యులను బయటకు పంపి నల్ల చట్టాలను రూపొందిస్తుందని మండిపడ్డారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తికి సంబంధం లేకుండా ఎన్నికల కమిషన్ పనిచేస్తుందని, ప్రజాస్వామికవాదులందరూ ఏకతాటిపైకి వచ్చి వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## ఫారాలు డబ్బులకు అమ్మితే కఠిన చర్యలు

- తహసీల్దార్ పద్మసుందరి హెచ్చరిక

అడ్డగుట్ట, డిసెంబర్ 29: జిరాక్స్, కిరాణ షాపుల నిర్వాహకులు ఎవరైనా డబ్బులకు దరఖాస్తు ఫారాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మారేడుపల్లి తహసీల్దార్ పద్మసుందరి హెచ్చరించారు. ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ అడ్డగుట్ట, మెట్టుగూడ డివిజన్లలో రెండవరోజు ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం నుంచే దరఖాస్తుదారులు స్వీకరణ కేంద్రాల వద్ద బారులుతీరారు. ఆయా ప్రాంతాల్లో దరఖాస్తుఫారాలు సరిపడ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దరఖాస్తుదారుల అవసరాన్ని గుర్తించిన చిరువ్యాపారులు, దళారులు ఒక్క ఫారం రూ.20 నుంచి రూ.50 వరకు అమ్మడం జరిగింది. అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్ రాం భవనంలోని కేంద్రాలను మారేడుపల్లి తహసీల్దార్ పద్మసుందరి పరిశీలించి దరఖాస్తుల స్వీకరణ జరుగుతున్న తీరును అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దరఖాస్తుదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తు కేంద్రాల వద్ద ప్రజలు ఫారాలను ఉచితంగా పొందాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈఈ వేణు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంటా రాజుసాగర్ పాల్గొన్నారు.





బీజేఆర్ కమ్యూనిటీ హాల్‌ను సందర్శించిన మారేడుపల్లి తహసీల్దార్ పద్మసుందరి



## ఓయూలో రాగ్యానాయక్ వర్ధంతి

మాజీ ఎమ్మెల్యే రాగ్యానాయక్ 22వ వర్ధంతిని 'గిరిజన శక్తి' ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ చంద్రునాయక్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాలునాయక్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌నాయక్, ఎల్ఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌నాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రమేశ్ రాథోడ్, వినోద్‌నాయక్, మురళీనాయక్, సతీశ్‌నాయక్, కల్యాణ్ నాయక్, మహేశ్, సంజీవ్ పాల్గొన్నారు. - ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 29

## 'ప్రజాపాలన'ను పరిశీలించిన కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, డిసెంబర్ 29: సీతాఫల్‌మండి డివిజన్‌లోని ఉప్పరిబస్తీ కమ్యూనిటీ హాల్‌లో రెండో రోజు ఆరు గ్యారెంటీల దరఖాస్తు స్వీకరణ కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ సామల హేమ సందర్శించి జీహెచ్ఎంసీ ఏఈ కౌషిక్‌తో మాట్లాడారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల దరఖాస్తులను 'ప్రజాపాలన'లో జనవరి 6వ తేదీ వరకు ప్రతి వార్డులో స్వీకరిస్తారని, ప్రతి ఇంటికి ఆర్‌పిలు దరఖాస్తులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఇతర సమస్యలపై కూడా వినతి పత్రాలు స్వీకరణకు ప్రత్యేకమైన కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఉప్పరిబస్తీ కమ్యూనిటీ హాల్‌లో అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

## ప్రజాపాలన దరఖాస్తు గడువు పెంచాలి

అడ్డగుట్ట, డిసెంబర్ 29: ప్రజాపాలన దరఖాస్తు గడువును మరో నెల రోజుల పొడిగించాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం అడ్డగుట్టలో ఆయన మాట్లాడుతూ... దరఖాస్తు చేసుకునే విధానంపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రత్యేక బృందాల ద్వారా అవగాహనను కల్పించాలని కోరారు. సమయం తక్కువగా ఇవ్వడంతో దరఖాస్తుదారులు అయోమయానికి గురవుతున్నారని, ప్రైవేట్ వ్యక్తులు ఫారాలను అమ్ముకొని దోచుకుంటున్నారని ఆరోపించారు.

## సుబ్రహ్మణ్యస్వామి హుండీ లెక్కింపు

మారేడ్‌పల్లి, డిసెంబర్ 29: మారేడ్‌పల్లి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు జరిగింది. ఆలయ ఈవో అరుణ కుమారి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అండాలు, ఆలయ చైర్మన్ సి.సంతోష్‌యాదవ్ పర్యవేక్షణలో హుండీని లెక్కించారు. హుండీ ద్వారా రూ.4,74,000ల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు రమేశ్, భాస్కర్, అర్చకులు టి.రాజేశ్వరశర్మ పాల్గొన్నారు.

## 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'

బొల్లారం, డిసెంబర్ 29: కంటోన్మెంట్ లాల్‌బజార్ శ్రీ మహంకాళి దేవాలయం వద్ద శుక్రవారం 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'లో భాగంగా ఉచిత వైద్య శిబిరం, ఆయుష్మాన్ భారత్ కార్డు, ఆధార్ అప్‌డేట్, ఉజ్వల గ్యాస్ వంటి సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీగణేశ్, సరిత, రాకేశ్, నీరజ్ పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, డిసెంబర్ 29: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు కథనం ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై శుక్రవారం ఉదయం గుర్తు తెలియని ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి సుమారు 40–45 ఏండ్లు ఉంటాయని, సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 58581, 9666280808 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు సూచించారు.